క్లుప్తంగా

పీహెచ్‌సీని మార్చాలి

కొత్తూరు: ప్రస్తుతం నందిగామ మండలం తాటిగడ్డతండాలో కొనసాగుతున్న కొత్తూరు పీహెచ్‌సీను మండల కేంద్రంలోకి మార్చాలని బీజేపీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగ రాజుచారి శుక్రవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మండలకేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లేందుకు రోగులతో పాటు సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీను ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్చాలని కోరారు.

ఆలయం కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి



ఏసీపీకి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్టపై ఉన్న చౌడమ్మ దేవాలయాన్ని కూల్చిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కుషాల్కర్‌కు వినతి పత్రం అందజేశారు. పురాతన దేవాలయాలను శుక్రవారం బీజేపీ నేతలు సందర్శించారు. అనంతరం బీజేపీ నేతలు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఆలయాల భూములు మాయమవుతున్నాయని ఆరోపించారు. చౌడమ్మగుట్టపై కూల్చిన దేవాలయాన్ని తిరిగి పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమా ర్, నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, వెంకటేశ్, శ్యాంసుందర్‌రెడ్డి, శేఖర్, వెంకటేష్, వంశీ, శివాజీ, రాజు పాల్గొన్నారు.

సీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



మ్యాచ్‌ను ప్రారంభించిన అశోక్ యాదవ్

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో శుక్రవారం సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్‌ఎస్ నేత అశోక్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. టోర్నీలో గెలుపొందిన జట్టుకు రూ.9999, రన్నర్ జట్టుకు రూ. 5555 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నాని, సాయి, రమేష్, శివ, శ్రీను, రాజేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి మంగళసూత్రం బహూకరణ

కొందుర్గు: పేదింటి పెళ్లికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో మండలంలోని పులుసుమామిడి గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి పుస్తెమెట్టెలు బహూకరించారు. గ్రామానికి చెందిన నిర్మలమ్మ బుచ్చయ్య దంపతుల కూతురు శ్రీలత పెళ్లికి శుక్రవారం మహిపాల్‌రెడ్డి పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కొందుర్గు చేరనున్న భట్టి పాదయాత్ర

కొందుర్గు: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర శనివారం కొందుర్గు మండలానికి చేరుకుంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం మండలంలోని రేగడిచిల్కమర్రి చేరుకుంటుందని, అక్కడి నుంచి ఉమ్మెంత్యాల, లూర్దునగర్ వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఆదివారం లూర్దునగర్ నుంచి కొందుర్గు, లాల్‌పహాడ్ మీదుగా వికారాబాద్ జిల్లా తొండపల్లి నుంచి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు వరకు చేరుతుందన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు గౌడ్

ఆమనగల్లు: పట్టణంలో శుక్రవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా మాడ్గుల మండలం సుద్దపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పీఆర్వోగా పాష ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలగానే సర్వీస్ రోడ్ల అభివృద్ధి

- గుంతలమయంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



పెంజర్ల కూడలి సమీపంలో అభివృద్ధికి నోచుకోని సర్వీస్‌రోడ్డు

కొత్తూరు: అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారు. విషయం తెలిసినా అటు అధికారులు.. ఇటు కాంట్రాక్టర్లు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. గత తొమ్మిదేళ్ల క్రితం మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటైంది. కాగా, రోడ్డుకు ఇరువైపులా ఉన్న (అనుబంధ) సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయడం మరిచారు. ఘట్‌కేసర్–యాదగిరిగుట్ట, అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ అధికారులు ప్రధానరోడ్లతో పాటే సర్వీస్ రోడ్లను పూర్తి చేశారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు ప్రధాన రోడ్లపైకి వెళ్లకుండా సర్వీస్‌రోడ్ల నుంచే రాకపోకలు కొనసాగిస్తూ సురక్షితంగా తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. కాగా, కొత్తూరు మండలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. కొత్తూరు నుంచి సోలీపూర్ గేటు వరకు ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లను అభివృద్ధి చేయలేదు. దీంతో సమీప గ్రామాల ప్రజలు బైపాస్ రోడ్డుపై నుంచి ప్రయాణిస్తూ తరచుగా ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. స్థలం సేకరించిన అభివృద్ధి లేదు.. 2009లో కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. అప్పుడే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల కోసం స్థలాన్ని సైతం సేకరించారు. తర్వాత ప్రధాన రోడ్డును పూర్తి చేసిన కాంట్రాక్టర్లు కొన్ని సంవత్సరాల తర్వాత సర్వీస్ రోడ్లపై మట్టిపోసి చదును చేసి చేతులు దులుపుకున్నారు. అంతేతప్ప ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. అధికారులు సైతం చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కొత్తూరు శ్మశాన వాటిక వద్ద సర్వీస్‌రోడ్డుపై పారుతున్న నీరు

ఫలితం శూన్యం..

బైపాస్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలపై ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గత ఐదేళ్ల క్రితం పలువురు అధికారులు, రోడ్డు నిర్వహణ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరగా.. అందుకు వారు తమ ప్రొసీడింగ్స్‌లో సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేసే విధంగా ఒప్పందం లేనట్లు ఎమ్మెల్యేకు విన్నవించారు. కానీ, 18 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సర్వీస్ రోడ్లపై మాత్రం మట్టిపోసి ఇరువైపులా వాహనాలు వెళ్లే విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీ ఇప్పటి వరకు వాస్తవరూపం దాల్చలేదు.

మా జీవితాలతో చెలగాటమాడొద్దు

సోనీ మృతికి నివాళులర్పించిన జేపీఎస్‌ల సంఘం సభ్యులు



సోనీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

చేవెళ్ల: జేపీఎస్‌ల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దని జేపీఎస్‌ల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన జేపీఎస్‌ల సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం అల్టిమేటంతో మనస్తాపానికి గురైన జేపీఎస్ సోనీ ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె మృతికి సంతాపం ప్రకటించి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. విధుల్లో వెంటనే చేరాలి లేకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం జారీ చేసిన అల్టిమేటంతో తీవ్ర మనస్తాపానికి గురైన సోనీ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు జరిగిన సమ్మెలో కూడా ఆమె చురుగ్గా పాల్గొన్నట్లు ఫొటోలు ఉన్నాయని చెప్పారు. నిజంగా ప్రభుత్వం హెచ్చరికతోనే మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని కోరారు. సమ్మెలో చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి , మండలాల జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలోకి భట్టి పాదయాత్ర

ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు



భట్టి విక్రమార్కతో కలిసి నడుస్తున్న నాయకులు

చేవెళ్ల: పీపుల్స్ మార్చ్ పేరుతో కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర శుక్రవారం చేవెళ్లలోకి ప్రవేశించింది. జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన పార్టీ శ్రేణులతో కలిసి ఆయన వెంట పాదయాత్రలో నడిచారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్‌పార్టీ టీపీసీసీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బి. శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గం నాయకులు ఎస్. వసంతం, దర్శన్, భీంభరత్, జిల్లాపార్టీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రాములు, పెంటయ్యగౌడ్, వీరేందర్‌రెడ్డి, మానేయ్య, సురేందర్, సూర్యాపేట శ్రీనివాస్, పాండుయాదవ్, రాంరెడ్డి, శేఖర్, వాజిద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

15 నుంచి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడాపోటీలు



కొందుర్గులో మైదానం సిద్ధం చేస్తున్న ఆంజనేయులు, తదితరులు

కొత్తూరు: నందిగామ మండలంలోని రంగాపూర్‌లో ఉన్న నాట్కో పాఠశాల మైదానంలో చీఫ్ మినిస్టర్ కప్–2023 మండలస్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న క్రీడల్లో పాల్గొనే వారి(జట్ల) వివరాలను 13 లోపు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు పలు అథ్లెటిక్స్ క్రీడాపోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 15–36 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు క్రీడల్లో పాల్గొనే విధంగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రచారం నిర్వహించాలని కోరారు.

మైదానం సిద్ధం చేస్తున్న అధికారులు

కొందుర్గు: సీఎం కప్ 2023 ఆటల పోటీలు కొందుర్గులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. పోటీల నిర్వహణకు శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా మైదానం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో క్రీడాలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో స్త్రీ, పురుషులు రెండు విభాగాలు ఉంటాయని తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రధానంతో పాటు, ప్రతిభచూపిన వారిని డివిజన్, జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

ఆటల పోటీల నిర్వహణకు కమిటీ ఏర్పాటు

షాద్‌నగర్: చీఫ్ మినిస్టర్స్ కప్ క్రీడాపోటీల నిర్వహణ కోసం మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో ఎంపీడీఓ వినయ్‌కుమార్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, కన్వీనర్‌గా ఎంపీడీఓ వినయ్‌కుమార్, సభ్యులుగా జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, తహసీల్దార్ గోపాల్, సీఐ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న తదితరులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 15న ఉదయం 9గంటలకు పట్టణంలోని మినీస్టేడియంలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

'కంటి వెలుగు'కు విస్తృత ప్రచారం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



ఇంటింటి సర్వేలో డాక్టర్ జయలక్ష్మి, సిబ్బంది

షాద్‌నగర్: కంటి వెలుగు శిబిరాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి సమస్యలు ఉన్న వారిని శిబిరాలకు తరలించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ, బూర్గుల గ్రామాల్లో ఇంటింటికి సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో డాక్టర్ జయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంధత్వ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. దృష్టి సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉంటే వారిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సరోజినీ ఆస్పత్రికి రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి శిబిరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఆశ కార్యకర్తలకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. వృద్ధుడు (65) గత కొంత కాలంగా పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇందిరానగర్ కాలనీలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాల కోసం ఎంత ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా వెంటనే 9440795741, 9441285247 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ కోరారు.

ఏపీఎం కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: సెర్ప్ ఏపీఎం సతీశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్య నిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెపోటుతో మృతి చెందిన ఏపీఎం సతీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో చురుగ్గా ఉండే సతీశ్‌కు మృతిచెందడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపై వేధింపులు పాల్పడొద్దని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ జంగారెడ్డి, సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'భగీరథ' పైప్‌లైన్ వేయండి

కడ్తాల్: మండల పరిధిలో రేఖ్యానాయక్ తండా నుంచి రావిచేడ్ గ్రామం వరకు మిషన్ భగీరథ ప్రత్యేక పైప్‌లైన్ వేయాలని ఎంపీటీసీ సభ్యుడు గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సీఈ రాజేశ్వర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. తాగు నీటి సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు రమేశ్‌యాదవ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రండి

జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణేశ్ తదితరులు

నందిగామ: షాద్‌నగర్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పండగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ ఆదివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ పేర్కొన్నారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెకంరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గణేశ్ హాజరై విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గణేశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండాలని, విద్య ఉద్యోగ, రాజకీయాలతో పాటు వ్యాపారాల్లో రాణించాలని సూచించారు. పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరణకు ముదిరాజులందరూ భారీ ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేగూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, నాయకులు నర్సింహా, అశోక్, చందన్, సాయిలు, యాదయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం నర్సులు



నర్సులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

- లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి
- నర్సుల సహకారంతోనే ఆస్పత్రుల నిర్వహణ: డాక్టర్ రాధిక

కందుకూరు: రోగులకు సేవలు అందించడంలో నర్సుల పాత్ర ప్రాముఖ్యమైనదని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పీహెచ్‌సీలోని నర్సులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిస్వార్థ సేవకు ప్రతిరూపం నర్సులన్నారు. ప్రాథమిక వైద్యంలో, దీర్ఘకాలిక వ్యాధులతో సపర్యలు చేస్తూ మానవాళి ఆరోగ్యానికి భరోసా కల్పించడంలో నర్సుల పాత్ర అమోఘమైనదని కొనియాడారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక మాట్లాడుతూ.. నర్సుల సహకారం లేకపోతే ఆస్పత్రుల నిర్వహణ కష్టతరమన్నారు. లయన్స్‌క్లబ్ వారు నర్సుల సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యుడు కె.వెంకటేశ్వర్లుగుప్తా, హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ నిర్వాహకుడు తమ్మలి ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం



చెక్కు అందజేస్తున్న ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో బాయికాడి రాకేశ్(8) 2022 జనవరి 15న సంక్రాంతి సందర్భంగా గాలిపటం ఎగరేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామ ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్ విద్యుత్ ప్రమాద విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వారు రూ.5లక్షల పరిహారం మంజూరు చేశారు. ఈ చెక్కును శుక్రవారం ఎంపీటీసీ సభ్యుడు రాకేశ్ తల్లి వెంకటమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అధికారుల సహకారంతోనే రాకేశ్ కుటుంబ సభ్యులకు పరిహారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య, వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నరసింహస్వామి కల్యాణం



కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు



మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న వేదపండితులు

- హాజరైన ప్రముఖులు
- ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో సుదర్శన మహాయాగం నిర్వహించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ , మంజుల దంపతులు, డాక్టర్ అఖిల్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. నరసింహ శర్మ, మురళీధర్ శర్మలు మంత్రాలు పఠిస్తుండగా లక్ష్మీ నరసింహ స్వామి, నవగ్రహాలు, హనుమాన్, గణపతి, లక్ష్మీదేవి తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మంగళహారతి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జీ శ్రీనివాసరెడ్డి, ఆమనగల్లు కోర్టు సివిల్ జడ్జి స్వరూపా కాటం, పీఏసీఎస్ చైర్మన్ జీ కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వీరిని సాదరంగా ఆహ్వానించి సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ ఏ సత్యం, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, జెడ్పీటీసీ వెంకటేశు, ఎంపీపీ నిర్మల, సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ రవికుమార్, సర్పంచులు లలిత, గోపాల్‌నాయక్, రఘుపతి, జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీల మండల అధ్యక్షులు రమేష్, హేమరాజు, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, బీజేవైఎం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ అనీల్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

ఎంపీఓ మధుసూదనాచారి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ

కడ్తాల్: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ మధుసూదనాచారి అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని శుక్రవారం ఆయన సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలకు ఏర్పాటు చేసిన నీటి వసతులు, మొక్కలు ఎండిపోకుండా తీసుకున్న జాగ్రత్తల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో 10వేల మొక్కల చొప్పున 24 పంచాయతీల్లో మొత్తం 2.40లక్షల మొక్కలను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈజీఎస్ సిబ్బంది పర్యవేక్షణలో జూన్ నాటికి మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక ప్రకారం పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శి రాఘవేందర్, నాయకులు భిక్షపతి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.